

# యండమూరి కథాస్రవంతి

– డా.యండమూరి వీరేంద్రనాథ్



# దానం

వ్యాన్‌కి కొద్దిగా మెలకువ వస్తోంది. ఆత్రుతగా ఎవరో మొహంలో మొహం పెట్టి చూస్తూ... 'లేవండి... ఎలా ఉంది..?' అని అడుగుతున్నారు.

ఆ రూపం చాలా అస్పష్టంగా ఉంది. ఆడో మగో తెలీలేదు.. కళ్ళు పూర్తిగా తెరుచుకోలేదు. తలంతా దిమ్ముగా, నెత్తి మీద ఎవరో ఓ యాభై కిలోలు బరువు పెట్టినట్టుగా ఉంది.

"ఏవండీ" అని పిలుస్తూ ఈ సారి అది చాలా మృదువుగా, శ్రావ్యంగా వినిపించింది. ఆ స్వరం ఓ 'స్త్రీ'దని గుర్తించాడు.

కళ్ళు తెరవడానికి మరోసారి ప్రయత్నించాడు. పెద్ద వెలుతురు. భరించలేనట్లు కనురెప్పలు మూసుకుపోతున్నాయి. అతి కష్టం మీద కుడి చెయ్యి లేపి కళ్ళకి అడ్డు పెట్టుకున్నాడు.

"నెమ్మదిగా కళ్ళు తెరవండి. నేను కనపడ్తున్నానా?" ఆమె అడిగింది.

ఆ నిమిషంలో అమెని చూడాలని అతనికెంతో అనిపించింది కానీ, శరీరం సహకరించడం లేదు! తన స్థితి తనకే అర్థం కావటం లేదు.

సడెన్‌గా కారుకి అడ్డంగా... అది జింకా?... మేకా? ఒళ్ళంతా చుక్కలున్నాయి. దాన్ని తప్పించ బోయాడు. లోయ అంచున కారు... బ్రేక్‌ని ఎంత అదిమిపెట్టినా లాభం లేకపోయింది. ఆ తరువాత ఇంకేమీ తెలీదు. ఒక రోజంతా పడున్నానని అనుకుంటున్నాడు కానీ, ఎంత కాలమో తెలీదు.!

"నాన్న ఎంత కంగారుపడుతున్నారో. నా సెల్‌ఫోన్ ఏదీ?" ఎడమ చెయ్యి కదిలించి కోసం వెతికాడు.

"ఏమిటి వెతుకుతున్నారు?" ఆ చేతి మీద ఒక చల్లటి స్పర్శ. ఇందాకటి మృదువైన స్వరం అడుగుతోంది.

ఏమైతే అయింది కళ్ళు తెరవాలనుకున్నాడు. వెలుతురు పడుతుంటే కళ్ళలో సూదులు పొడుస్తున్నంత బాధగా ఉంది. అయినా మొండిగా తెరిచాడు. ఎదురుగా ఒక అమ్మాయి..! మొదట లీలగా... తర్వాత కొద్ది కొద్దిగా స్పష్టం అవుతూ కనిపిస్తోంది. వెన్నెలంత సౌమ్యంగా ఉంది. ముక్కుకున్న ఒంటిరాయి ముక్కుపుడక మెరుస్తూ కనిపించింది. ఆమె పెదవులు ఒంపు తిరిగి నవ్వుతున్నట్టు ఉన్నాయి. కళ్ళలో చల్లదనం ఉంది. దువ్వుకోకుండా రేగి ఉన్న వెంట్రుకలు నుదుటి మీద పడ్తున్నాయి.

"ఎలా ఉందీ?" ఆమె అడిగింది.

"నాకేమైందీ?" మాట్లాడాడు. గొంతు లోతుల్లోంచి వచ్చిన స్వరం అతడికే సరీగ్గా వినపడ లేదు.

ఆమె మొహంలో ఆనందం. "థాంక్ గాడ్... మీరు మాట్లాడారు... ఇంకేం ఫర్వాలేదు" అంది.

"అసలు... అసలేమైంది? నా కాళ్ళూ... అవీ ఒకేనా?" అంటూ కాళ్ళు కదిపే ప్రయత్నం చేసాడు.

"ఉండండి... కాలికి ప్లాస్టర్ ఉంది"

అతను తడిమి చూసుకుంటూ ఉండగా ఆమె అన్నది. "మీ కాలు మీదున్న కొండ రాయిని తొలగించి తీసుకొచ్చారు. పక్క పట్నం నుంచి అప్పుడప్పుడూ డాక్టర్ పాల్ మా పల్లెకి వస్తాడు. ఆయనే మా కొండదొరకి ప్లాస్టర్ వెయ్యడం నేర్పించారు. అతనొచ్చి వెదురుబొంగు వేసి, స్ట్రెయిట్‌గా పెట్టి ప్లాస్టర్ వేశాడు..."

"అంటే ఫ్రాక్చర్ అయిందా?" ఆత్రుతగా అడిగాడు వ్యాస్.

"తెలీదు. అంబులెన్స్‌కి ఫోన్ చేశాం. మొన్న తుఫానుకి ఏరు పొంగి, దారంతా చెట్లు అడ్డంగా పడి ఉన్నాయి. రెండు రోజులు పట్టుతుందన్నారు" అంది.

"మైగాడ్! ఇది అడవా?" లేవడానికి ప్రయత్నిస్తూ అన్నాడు.

"అలాంటిదే... గిరిజనులుండే కొండప్రాంతం. ఏజెన్సీ ఏరియా. మైనపు వలస... మీ గూగుల్ మేప్ లో ఇదుందని కూడా తెలీదు".

అప్పటికి అతడు కాస్త తేరుకున్నాడు. "మరి మీరెందుకు ఇక్కడున్నారు?" ఆశ్చర్యంగా అడిగాడు.

ఆమె పక్కనే ఉన్న గ్లాసు మీద మూత తీసి, అందులో ద్రవాన్ని అతనికి తాగిస్తూ "మెల్లగా గుటకెయ్యండి... రాగి జావ" అంది.

"మీరు డాక్టరా?" తాగుతూ అడిగాడు.

"టీచర్‌ని".

"ఇక్కడా?"

తనున్న ప్రదేశం అంతా పరిశీలించి చూశాడు. వెదురుతో చేసిన తడకలు. మంచం, పక్కనే నేల మీద చాప, టేబుల్ ఫ్యాన్, ఓ మూలగా టేబుల్ మీద స్టౌ, గిన్నెలూ ఉన్నాయి. ఇంత సింపుల్‌గా ఉన్న ఇంటిని... కాదు 'పాక' ని... అతడు ఎప్పుడూ చూడలేదు!

గిన్నెలోంచి వంచి అతనికి ఆమె ఇంకాస్త జావ తాగించింది. వ్యాస్‌కి ఎంతో శక్తి వచ్చినట్లు అనిపించింది. అప్పటి దాకా కనపడని తల నొప్పి కూడా తెలిసింది. 'అబ్బా' అని నుదుటి మీద చెయ్యి పెట్టుకున్నాడు. చేతికి పెద్ద కట్టు తగిలింది.

అతడు తన బాధ మర్చి పోవటానికా అన్నట్టు ఆమె "నా పేరు శతరూప..." అంటూ ప్రారంభించింది. "ఇక్కడి గిరిజనుల పిల్లలకి చదువు చెప్తున్నాను. 'సహారా' అనే సంస్థ నాకు జీతం ఇస్తుంది. జీతం తక్కువే కానీ ఇక్కడ దొరికే ప్రేమ ఎక్కువ" అంటూ నవ్వింది. "కష్టాలు కూడా కొన్ని ఉన్నాయనుకోండి. ఒక్కోసారి సెల్ ఫోన్ సిగ్నల్స్ కోసం పడిగాపులు పడాల్సొస్తుంది. కరెంట్ కూడా ఎప్పుడు పోతుందో చెప్పలేం"

మనుష్యులకి దూరంగా, ప్రకృతికి దగ్గరగా, గిరిజన పిల్లల అమాయకత్వాన్ని జ్ఞానంగా మార్చాలన్న కోరిక ఆమెకు ఆలంబనగా ఉన్నట్టూ అనిపించింది. పొడవుకు తగ్గ లావుతో, మంచి శరీర దారుఢ్యం ఉన్న అమ్మాయిలా కనిపించింది. కట్టుకున్న చీర నలిగి పోయి ఉంది. విరబోసుకున్న జుట్టు చాలా పొడవుగా ఉంది. మెడలో ఎర్ర పూసల దండ, అదే ఎరుపుతో మోహన బొట్టూ... ఇవి మాత్రమే ఆమె ఆభరణాలు.

"నా కారు..." అడిగాడు సందేహంగా.

"దొరికినా మీరు వాడలేరు. మీ సెల్‌ఫోన్ కూడా లోయలో ఎక్కడో పడిపోయి ఉంటుంది. రెండు చెట్టు కొమ్మల మధ్య స్పృహ తప్పి ఉన్న మిమ్మల్ని చూసి నన్ను పిలుచుకొచ్చారు. నేను అంబులెన్స్‌కి ఫోన్ చేశా. అది రాదని తెలిసి కొండ దొరకి కబురు పంపి, అతని సహాయంతో మిమ్మల్ని ఇక్కడికి చేర్చాను. డాక్టర్ పాల్ గారు ఎల్లుండి వస్తారు. చాలా ఎఫీషియెంట్. అయినా ఈ మాత్రం మాట్లాడుతున్నారంటే ఇంకేం ఫరవాలేదు! ఇదివరకు ఎవరూ కూడా...." అని ఆగిపోయి "నేను అన్నం వండుతాను" అని లోపలికి వెళ్ళబోయింది.

ఆమె సడెన్‌గా ఆపెయ్యడం గుర్తించి "ఇది వరకు ఇలా చాలామంది...? చా..లా..మంది...? ఏమయ్యారు? చచ్చి పోయారా? ఇక్కడ ఏక్సిడెంట్లు మామూలేనా?" అని అడిగాడు.

"ఈ ప్రాంతంలో చాలా ఏక్సిడెంట్లు జరిగాయి. సాధారణంగా కొండ చుట్టి వెళ్ళాలనుకునే వాళ్ళు, దగ్గర దారని దీన్ని ఎంచుకుంటారు. ఇక్కడ ఏక్సిడెంట్లు అవడం, గిరిజనులు వాళ్ళ శవాలను దగ్గరలోని ఆసుపత్రికి అప్పగించడం పరిపాటే. అవన్నీ ఎందుకు గానీ, ఈపూటకి పచ్చడి అన్నం పెడ్తాను. సరేనా? సరే కాకపోయినా నేనేం చెయ్యలేను" అంటూ నవ్వింది.

"ఏదైనా ఫర్లేదు. మిమ్మల్ని ఇబ్బంది పెడ్తున్నాను. నేను లేవలేను. ఇక్కడ మగవాళ్ళెవరూ లేరు. ఎలా?" ఇబ్బంది పడుతూ సందేహంగా అడిగాడు.

ఆమె "నాకు నర్స్ పని కూడా వచ్చు. ఇక్కడ ట్రైబల్స్ కి జ్వరం వస్తే నేనే" అంటూ నవ్వింది. మాటి మాటికీ నవ్వటం ఆమె అలవాటు అనుకుంటాను. ఆమె మొహానికి అది ఎంతో బావుంది. కొంతమందికే ఆ ఆర్టు పుట్టుకతోనే వస్తుంది.

ఆమె చెయ్యి చూపిస్తున్న వైపు చూస్తే, కుర్చీ కింద బెడ్-పాన్ కనపడింది.

అతను అన్నం తింటూ ఉండగా, 'స్పృహ లో లేనప్పుడు కొండ దొరా యాంటీ సెప్టిక్ టెటనస్, పెయిన్ కిల్లర్ ఇంజెక్షన్స్ ఇచ్చి వెళ్ళాడని' ఆమె చెప్పింది.

అంతలో కరెంట్ పోయింది.

"ఇంక పొద్దుటి దాకా రాదు" అంది.

ఆ గుడిసె పై కప్పు చూస్తుంటే, తన జీవితం 'కెలడోస్కోప్' లో గాజుముక్కల్లా ఒక్కసారిగా చెల్లాచెదురై అంతలోనే కొత్త రూపం సంతరించుకున్నట్లు అనిపించింది.

ఆ రోజుల్లో తన తాత జోగులయ్యగారు ఒక జమిందారు గారి దగ్గర గుమస్తా. ఆ జమిందారు తన వేల ఎకరాల భూమిలో కొంత జీతగాళ్ళకి వ్రాసి ఇచ్చాడు. ఆయన దాతృత్వం గురించి ఆ రోజుల్లో గొప్పగా చెప్పుకునేవారుట. ఆ తరువాత కొన్ని సంవత్సరాలకి ఆయనికి 'పద్మశ్రీ' కూడా వచ్చింది. ఆయన కొడుకు పెద్ద డాక్టరనీ, లండన్ లో చదువుకుని వచ్చినా, తండ్రి గుణాలు పొదివి పుచ్చుకుని అదే పల్లెటూళ్ళో ఆస్పత్రి కట్టి పేదలకి సేవ చేస్తున్నాడనీ... అంత వరకే తెలుసు.

ఆయన దగ్గర పనిచేసిన తన తాత విషయానికి వస్తే, తన వంతుగా వచ్చిన భూమిని అమ్మి ఆయన కాఫీ తోటల్లో పెట్టుబడి పెట్టాడట. దశ తిరిగింది. ప్రస్తుతం ఆయన కొడుకే 'కాఫీ కింగ్' అని పిలవబడే పృథ్విరాజ్. ఆ రాజు కొడుకు తాను..! కోరుకోవాలే కానీ కొండ మీద కోతినే కాదు, కొండనే కొనెయ్యగల తండ్రున్నవాడు... ఫిజికల్‌గా ఎంతో ఫిట్‌గా ఉండే కారు రేసర్...

రేపో మాపో తండ్రి 'వ్యాస్ అండ్ కో' కాఫీ కంపెనీకి తాను ఎం.డి. కాబోతున్నాడు.

ఆ సందర్భంగా "డ్రమ్ముల కొద్దీ మందు... రేవ్ పార్టీ... డాన్సులు... బాంబే నుంచి డాన్సర్లు.. మీ కాఫీ ఎస్టేట్స్‌లో పిక్నిక్ వెయ్యవా?" అన్న ఫ్రెండ్స్ కోరిక మీద, ముందు ఏర్పాట్లు చూడటానికి బయల్దేరాడు. 'మన కాఫీ తోటలు చూసొస్తా డాడీ' అని బయల్దేరడం, కార్ విండో లోంచి లోపలికి వంగి 'జాగ్రత్త నాన్నా' అని తండ్రి అనడం 'వ్యాస్‌తో పోటీ పడి కార్ డ్రైవ్ చేసేవాడు ఎక్కడా ఉండడు నాన్నా. భయపడకు...' అని మనసులో అనుకుని బయల్దేరటం... డ్రైవర్‌ని తీసుకెళ్లటం నామోషీగా ఫీల్ అయి, తన డ్రైవింగ్ మీద అపారమైన విశ్వాసంతో కొండలతో పందెం కట్టి, రేసుగుర్రంలా కారు నడిపించటం.... ఫలితంగా ఈ ఆక్సిడెంట్...

ఈ పాఠం నేర్పింది ఎవరు? విధా? భగవంతుడా? రెండూ ఒకటేనా?

ఇక్కడ తను 'శతరూప'కే ఎందుకు కనిపించాడు. ఆమెని ఆ దేవుడే పంపాడా?

డాడీ ఏం చేస్తూ ఉండి ఉంటారు? తన కోసం ఏ హెలికాప్టర్‌లోనో వెతుకుతూ ఉండి ఉంటారా?

అతడు తల తిప్పి చూసాడు. క్రింద చాప మీద పక్కకి తిరిగి పడుకునుంది.

గూట్లో పెట్టిన లాంతరు నీడ ఆమె మీద పొడుగ్గా పడ్తోంది. శతరూప అందగత్తె అని చెప్పలేం. ముఖ్యంగా... ఆమెలో ఏదో తెలియని ప్రశాంతత ఉంది. ఈ వయసులో అందరికీ దూరంగా ఒంటరిగా ఇంత నిర్భయంగా ఎందుకుంటోంది? పెళ్ళయిందా?

చాలా బీదదానిలా ఉంది. అవును. లేక పోతే అంత తక్కువ జీతానికి ఈ కారడవిలో ఎందుకు పని చేస్తుంది? ఏమైతేనేం? తన ప్రాణం కాపాడింది. ఆశ్రయం ఇచ్చింది. సేవలు చేసింది.

రేపు డాడీకి తను ఎక్కడున్నానో తెలిసి తీసుకెళ్ళడానికి వస్తారు. అప్పుడు ఈమెకి ఏం ప్రత్యుపకారం చెయ్యాలి?

తన కంపెనీలో పెద్ద ఉద్యోగం ఇస్తే?

పోనీ... ఆమెకెంత కావాలో అంత చెక్ రాసిస్తే?

ఇక్కడ సెల్ టవర్  పెట్టిస్తే? జనరేటర్ పెట్టిస్తేనో?

ఇలా ఆలోచిస్తూ పడుకున్న అతనికి, ఆమె సడెన్‌గా వెల్లకిలా తిరిగే సరికి ఆచ్ఛాదన లేని ఎద పొంగులు కనిపించాయి. అడవి మల్లెలా... అవి అడవి పాలేయన్న వెన్నెలలా... ఆమె ఇప్పుడు సరికొత్త కోణంలో కనిపించింది.

శతరూపని పెళ్ళి చేసుకుంటే?

మినిష్టర్ మల్లుకార్జునరావ్ గారి అమ్మాయితో తనకి ఎంగేజ్‌మెంట్ జరగబోతున్నదని గుర్తొచ్చింది. సన్నగా గీతలా పాలరాతి శిల్పంలా ఉండే 'దిశ' గుర్తొచ్చింది. సో... పెళ్ళి జరగని పని. పోనీ... ... ... శతరూపని తను అప్పుడప్పుడూ... వచ్చి... చూసుకుంటే?

ఇన్ సింపుల్ టర్మ్స్ '...ఉంచుకుంటే'?

ఉలిక్కిపడ్డాడు.

అంతలోనే 'వాట్స్ రాంగ్?' అనిపించింది.

తనతో ఉంటే ఆమె లైఫ్ సెక్యూర్డ్‌గా ఉంటుంది కదా.

తనికి గర్ల్‌ఫ్రెండ్స్  కొత్త కాదు! కానీ ఈమె...

ఈ ఆలోచనలతో అతనికి తెలియకుండానే నిద్ర పట్టింది.

...

తెల్లారి లేచేసరికి శతరూప 'పాలు' అంటూ తీసుకొచ్చి ఇచ్చింది.  గంజి పెట్టిన ఇస్త్రీ చీరలో చక్కగా తయారై ఉంది. అతడు గ్లాసు అందుకుంటూ "నేనెవరో, ఏమిటో నువ్వు అడగలేదు. తెలుసుకోవాలని లేదా?" అడిగాడు.

ఆమె నవ్వి, "సాటి మనిషి... ఈ అడవిలోకొచ్చాక ఆక్సిడెంట్ అయింది... అదొక్కటే నాకు తెలిసింది!" అంది.

"మా తాతగారి పేరు జోగులయ్యగారు. భవానీ ప్రసాద్ అనే జమీందారు దగ్గర లెక్కలు చూసేవారట. మా నాన్నగారి హయాంలో పట్నం వచ్చేశాం. మా డాడీ పృథ్వీరాజ్ గారు! కాఫీ ఎస్టేట్స్ పెట్టి బిలియనీర్ అయ్యారు. ఇప్పుడు ఆయన్ని అంతా 'కాఫీ కింగ్' అంటారు. అమ్మ నా పన్నెండో ఏట పోయింది. నేను ఒక్కడ్నే సంతానం. మీ లాంటి అమ్మాయిని ఇలాంటి చోట కలుస్తానని నేనెప్పుడూ అనుకోలేదు. శతరూపా! మీకు నాతో వచ్చేయాలనుకుంటే... అదే బయట ప్రపంచంలోకి వచ్చేయాలనుకుంటే, మంచి లైఫ్ ఇస్తాను... ఐ మీన్...  మంచి జాబ్..." తడబడ్డాడు.

ఆమె చిరునవ్వుతో "మీ తాతగారి పేరేమిటీ?" అడిగింది.

"జోగులయ్య గారు."

"పాలు తాగండి" ఆమె అందించింది.

"నా ప్రశ్నకు మీరు జవాబియ్యలేదు. మీరేం కావాలన్నా ఇస్తాను. పోనీ ఇక్కడే మీ కోసం ఓ గెస్ట్‌హౌస్ కట్టించనా? పవర్, ఇంటర్నెట్ అన్నీ అంతరాయం లేకుండా సప్లయ్ చేయించనా? ఏం చెయ్యను?... ఏదో ఒకటి అడగాల్సిందే? నాకింత చేసిన మీకు ఏదో ఒకటి చెయ్యకుండా వెళ్ళలేను" అన్నాడు.

ఆమె మాట్లాడలేదు.

దాన్ని మరోలా అర్థం చేసుకుని, "ఒక స్త్రీగా ఇంకేదైనా ఆశించినా సరే" అన్నాడు.

ఆమె తీక్షణంగా చూసింది.

"ప్రత్యుపకారం" అన్నాడు సరి దిద్దుకుంటునట్టు.

అతడి చివరి మాటలు పట్టించుకోకుండా ఆమె ఫోన్ పరికించి చూసి, "థాంక్ గాడ్. సిగ్నల్స్ ఉన్నాయి. ఎప్పుడైనా పోవచ్చు. తొందరగా మీ నాన్నగారికి ఫోన్ చెయ్యండి..." అంటూ బయటికెళ్ళింది.

వ్యాస్ తండ్రికి ఫోన్ చేసాడు.

అతడి స్వరం వినపడగానే, "బాబూ... నాన్నా... వ్యాస్... ఎక్కడున్నావురా? ఏమైందిరా? అని అట్నుంచి ఆయన ఏడ్చేశాడు.

సాధ్యమైనంత టూకీగా జరిగింది చెప్పాడు వ్యాస్.

"దేవుడున్నాడురా. ఉన్నాడు. కోటి రూపాల్లో... కాదు. కాదు  అనంత శతకోటి రూపాల్లో... .... ఉన్నాడు. నేను వస్తున్నా" అన్నాడు ఉద్వేగంగా.

----

అంబులెన్స్ వచ్చింది. పృథ్వీరాజ్ గారొచ్చారు. గూడెం అంతా గూడు కట్టి నిలబడి చూస్తున్నారు.

ఆయన శతరూపకి దణ్ణం పెట్టి "ఏ దేవతో నీ రూపంలో నా బిడ్డని కాపాడిందమ్మా. మా ఊరు వచ్చెయ్యి. మా కంపెనీలోనే ఉద్యోగం. నువ్వు కోరినంత జీతం" అన్నారు.

ఆమె మాట్లాడ లేదు.

వ్యాస్ కల్పించుకుని, "ఎందుకు సంశయం? వచ్చెయ్యి. ఈ దోమల మధ్య... సెల్ ఫోన్ సిగ్నల్సూ, కరెంటూ లేని అడవిలో ఎందుకు ఉండటం? నా సెక్రటరీ గానీ ఉండొచ్చు" అన్నాడు.

"అన్నీ తెలిసే నేను కోరుకొని వచ్చిన ఊరు సార్ ఇది " క్లుప్తంగా అన్నది ఆమె.

"ఏదైనా ఇచ్చి నీ ఋణం కొంతైనా తీర్చుకోనివ్వమ్మా. భగవంతుడి దయవల్ల ఆ దేవుడు నాకు చాలా డబ్బిచ్చాడు" అన్నాడు పృథ్వీరాజ్ బ్రతిమాలుతున్నాట్టు.

ఆమె నుంచి అదే చిరునవ్వు.

"స్కూల్ పెట్టించనా? పోనీ ఆసుపత్రి?" ఆయన ఆప్షన్స్ అడిగాడు.

ఆమె జవాబు చెప్పలేదు.

వ్యాస్ కి కోపం వచ్చింది. తాము ఇస్తున్న ఆఫర్ వద్దంటున్నందుకో, "తన దగ్గర 'పని' వద్దంటున్నందుకో" తెలీదు. కాస్త విసురుగా, "వస్తూన్న సాయం వద్దన కూడదు. మా తాత జోగులయ్య గారి పేరు మీద ఇక్కడి పిల్లలకి స్కూలు కట్టిస్తాను. నువ్వే చూసుకో..." అన్నాడు.

"మీ తాతగారు జోగులయ్యగారు అన్నారు కదా!" అంది.

ఆమె ఏం అడుగుతుందో వ్యాస్ కి అర్థం కాలేదు. తలూపాడు.

"ఆయన భవానీ ప్రసాద్ గారి దగ్గర పని చేసేవారుగా".

"అవును. ఆ జమీందారు మీకు తెలుసా?"

"ఆయన ఎప్పుడూ ఓ మాట చెప్తుండేవారు. ఓసారి దానం ఇచ్చినది తిరిగి తీసుకోకూడదని"

"అయితే?"

"ఆ భవానీప్రసాద్ గారు మా తాతగారు"

వాళ్ళు దిమ్మెరపోయారు.

అంబులెన్స్ కదిలిపోయింది.

★★★

(వచ్చే నెల మరో కథతో కలుసుకుందాం)